


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అందం

**తలుపు తోసుకుని** లోపలికి వచ్చిన నీల విసురుగా స్కూల్ బేగ్‌ని ఓ మూలకి విసిరింది. షూ విప్పి చెరోమూలకి పడేలా తన్నింది. విస్తుబోయి చూస్తున్న అపర్ణ కూతురు దగ్గరకి వచ్చి తలమీద చెయ్యివేసి నిమురుతూ అడిగింది.

"ఏమైంది రాజా?"

నీల తల్లి చీర కుచ్చిళ్ళలో తలదూర్చి పెద్దగా ఏడ్చింది.

"నువ్వు మా స్కూల్‌కి ఎందుకొచ్చావా?" అరిచింది.

"ఏం వస్తే? మీ ప్రిన్స్‌పాల్ ఫోన్ చేసారు. ఓసారి వచ్చి కలవమన్నారు. అందుకే వచ్చాను. ఏమైంది?" అపర్ణ అర్థంకాక అడిగింది.

"మీ అమ్మ ఎంత అందంగా ఉందో. పాపం నువ్వేంటి ఇలా' అని మా ఫ్రెండ్స్ నవ్వారు. మా టీచర్ క్లాస్‌లోకి రాగానే అడిగింది. 'నీలా మదర్‌ని చూసాను. ఎంత బాగున్నారో. మీ ఫాదర్ డార్కా?' అని. పిల్లంతా నవ్వారు." నీల మరోసారి బిగ్గరగా ఏడ్చింది.

అపర్ణ అప్రయత్నంగా కూతుర్ని పొదివి పట్టుకుని కళ్ళు తుడుస్తూ చెప్పింది.

"కొంచెం రంగు తక్కువైతే మాత్రమేం? నువ్వు ఎంత బాగుంటావో తెలుసా? నీ ఐ లాషెస్ పొడుగ్గా విసనకర్రల్లా ఉంటాయి. మా నీల అందగత్తె."

"అవునా? రా" నీల తల్లిని లాక్కెళ్ళి అద్దం ముందు నించోపెట్టింది.

"చూడు. నువ్వు తెల్లగా చందమామలా ఉన్నావు. నేను నల్లగా దెయ్యంలాగా ఉన్నాను. నీ ముక్కులు రెండు కలిసినా నా బండముక్కు కంటే సన్నగానే ఉంటాయి. నావి వంకరటింకర పళ్ళు. నోరు తెరిస్తే చాలు ఎర్రటి చిగుళ్ళు

కనిపిస్తాంటాయి. నేను బాగుంటానా? ఎందుకమ్మా నీలా పుట్టకుండా నాయనమ్మలాగా పుట్టాను'' నీల కళ్ళవెంట బొటబొటా నీళ్ళు కారాయి.

అపర్ణకి కూడా కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

''నువ్వు చక్కగా చదువుకుని తెలివితేటలతో, మంచితనంతో పెరిగి పెద్దయితే అంతా నీల మంచి అమ్మాయి, నీల బంగారుకొండ అంటారు. రూపం పర్మినెంట్‌కాదు. మంచితనం, తెలివే శాశ్వతం. నువ్వు ఎంచక్కా చదువుకుని డాక్టర్ అయ్యావనుకో. నువ్వు నిలబెట్టే ప్రతిప్రాణం తాలుకు కుటుంబం నిన్ను దేవతలా చూస్తుంది. సరేనా? యూనిఫాం మార్చుకుని మొహం కడుక్కురా. పాలు కలిపిస్తా'' అపర్ణ కూతుర్ని ముద్దు పెట్టుకుని చెప్పింది.

ఆ రాత్రి అపర్ణ భర్తతో చెప్పింది.

''నీల స్కూల్ అంత బాలేదేమో. టీచర్స్ కూడా పసిపిల్లతో మాట్లాడుతున్నామనే స్పృహ లేకుండా అమ్మలక్కల మాటలు మాట్లాడుతున్నారు.''

''నాకు ట్రాన్స్‌ఫర్ అయేలా ఉంది. ఎటూ వేరే ఊరికి వెళ్తాం కాబట్టి, ఈ ఏడాదికిలా కాని'' సుభాష్ చెప్పాడు.

''నీలమ్మా బాగున్నావా?'' కాలేజ్ నించి వచ్చిన నీలని నాయనమ్మ ఆప్యాయంగా పలకరించింది.

నీల ఆవిడ వైపు ఓసారి చూసి కళ్ళు వాల్చుకుంది. వికారమైన పోలికలతోపాటు తెల్లబడ్డ జుట్టుతో ఆవిడ మంత్రగత్తెలా ఉందనుకుంది.

''నీలా. నాయనమ్మ నిన్ను పలకరిస్తోంది'' అపర్ణ హెచ్చరికగా చెప్పింది.

''బాగున్నా గ్రానీ. నువ్వెలా ఉన్నావు?'' నీల ఆవిడ్ని పలకరించింది.

''బాగున్నా తల్లీ. పెద్దదానివయ్యావు'' నాయనమ్మ సంతోషంగా చెప్పింది.

నీల తన గదిలోకి వెళ్ళి అద్దంలో మొహం చూసుకుంది. కళ్ళముందు నాయనమ్మ మెదిలింది. కానీ అద్దంలోని నీల యవ్వన నిగారింపుతో వింత అందంతో మెరుస్తోంది. అపర్ణ శ్రద్ధవల్ల నీల చర్మం సుకుమారంగా కాంతులీనుతోంది. పొడవైన జుట్టు, క్లిప్ పెట్టడం వల్ల కొద్దిగా మారిన పలువరస. నీల ముఖంలో అందం ఆమె కళ్ళే.

ఓసారి నిట్టూర్చి బయటకి వచ్చింది. అంతా డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సుభాష్ నల్లగా ఉన్నా తల్లి పోలికలు రాలేదు. 'నాన్నా, అమ్మ చక్కగా ఉంటారు' నీల విచారంగా అనుకుంది.

సుభాష్‌కి ట్రాన్స్‌ఫరై త్రివేండ్రం మారాక, అపర్ణ ఎప్పుడూ నీల స్కూల్‌కి రాలేదు. ఏ అవసరమున్నా సుభాష్ వచ్చేవాడు. నీల చిన్నతనంతో తల్లి చెప్పింది మర్చిపోలేదు. తన రూపాన్ని మర్చిపోయేలా చేసేది చదువొక్కటే అని బలంగా నమ్మింది. స్నేహితులెవరూ లేకపోవడంతో చదువునే హాబీగా చేసుకుంది. ఆమె బెస్ట్‌ఫ్రెండ్ అపర్ణ ఒక్కతే.

అపర్ణ చైల్డ్ సైకాలజీ చదవకపోయినా కూతుర్ని బాగా అర్ధం చేసుకుంది. కూతుర్ని శ్రద్ధగా చూసింది. నీలకి సరిపడే రంగుల దుస్తులు కొనేది. జుట్టుని రకరకాల స్టయిల్స్‌లో అలంకరించేది. చదువుకుంటూంటే పక్కన కూర్చునేది. నీల ఆత్మన్యూనతా భావంలోంచి బయటకి రావాలని అపర్ణ చాలా కృషి చేసింది.

''చిట్టితల్లీ చదువైపోయిందిగా పెళ్ళి చేసుకుంటావా?''

నీల ఆ ప్రశ్నకి తలెత్తి ఓసారి తల్లిని చూసింది. నలభై ఐదేళ్ళ అపర్ణ ముప్ఫైలలో ఉన్నట్లుగా ఉంది. ఇప్పుడిప్పుడే లాఫ్ లైన్స్ కనిపిస్తున్నాయి. 'అమ్మ అందగత్తె' అనుకుంది. లేచి తల్లి ఒడిలో తలపెట్టుకుని చెప్పింది.

"అమెరికా వెళ్దామనుకుంటున్నాను"

అపర్ణ ఆ మాటలకి నిర్ఘాంతపోయింది.

"ఇక్కడే పిజిలో చేరతానన్నావుగా?" అడిగింది.

"రీసెర్చ్ చేయాలనుందమ్మా. యు.ఎస్ వెళ్తాను."

అపర్ణ మాట్లాడలేదు.

ఆ రాత్రి సుభాష్ కూతురితో చెప్పాడు.

"అమెరికా వెళ్తానన్నావుట? పెళ్ళి చేసుకుని వెళ్ళరా. మాకు నిశ్చింత"

నీల ఓసారి తల్లివైపు చూసింది.

"అమ్మ పక్కనుండగా నేనెవరికి నచ్చుతాను నాన్నా' అనుకుని చెప్పింది.

"రీసెర్చ్‌కి పెళ్ళి, తర్వాత పిల్లలు ఇవన్నీ హర్డిల్స్ నాన్నా. ప్లీజ్. ఇప్పుడు హాయిగా ఉన్నా. నాకు ఫుల్ టైం కావాలి. లేకపోతే చదవలేను."

"సరే నీ ఇష్టం. కానీ మీ అమ్మ నీ పెళ్ళి గురించి దిగులు పెట్టుకుంది. అది గుర్తుంచుకో" సుభాష్ హెచ్చరించాడు.

"ఎందుకమ్మా దిగులు? నాయనమ్మకి వెంకట్రామయ్య దొరకలా? అలాగే ఎవరో ఒకరు దొరుకుతార్లే" ఆ రాత్రి తల్లితో చెప్పింది.

అపర్ణ దెబ్బతిన్నట్లుగా చూసింది.

"ఇంకా అందాల గురించి ఆలోచిస్తున్నావా నీలా? కూతురి పెళ్ళి గురించి ప్రతీ తల్లి దిగులు పడుతుంది. అందులో అందచందాల ప్రసక్తిలేదు."

"అందమైన కూతురి పెళ్ళి గురించి కొంచెం తక్కువ దిగులు పడచ్చులే." నీల నవ్వింది.

నీల అమెరికా వెళ్ళి ఐదేళ్ళయింది. ఇంటికి ఫోన్ చేసినప్పుడల్లా అపర్ణ ఆశగా అడిగేది.

"ఇంకేంటి కబుర్లు? ఏవైనా విశేషాలున్నాయా?"

నీల పెద్దగా నవ్వి సమాధానం చెప్పేది.

"ఏమీలేవు. ఇంకా ఏ వెంకట్రామయ్యా దొరకలేదు."

ఆ సమాధానానికి దెబ్బతిన్నట్లు చూసే తల్లి మొహాన్ని ఊహించుకుంటే నీలకి ఆనందంగా ఉండేది.

"నీలా ఓసారి వచ్చి వెళ్ళరాదు? ఎంతోమంది ఏడాదికోసారి వచ్చి పోతూంటారు. నాకు తెలిసి నువ్వొక్కదానివే ఐదేళ్ళనించి ఇంటికి రానిది. వీడియో కాల్‌లో కనిపించవు. ఎందుకిలా?" ఓసారి సుభాష్ మందలింపుగా చెప్పాడు.

"ఏముంది నాన్నా అక్కడ? బోర్" చెప్పింది.

"అదేంట్రా? మేము లేమా?" సుభాష్ కోపంగా అడిగాడు.

నీల తడబడింది.

ఏర్‌పోర్ట్‌లో సుభాష్‌ని చూసి అల్లుకుపోయింది నీల.

"నాన్నా అమ్మ రాలేదా?" చుట్టూ చూస్తూ అడిగింది.

"లేదురా. అమ్మకి కొత్తగా మోకాళ్ళ నొప్పులు వచ్చాయి. ఇంతసేపు నుంచోలేదు పద" సుభాష్ కూతురి సామానున్న ట్రాలీ తోసుకుంటూ బయటకి వచ్చాడు.

ఇంటి ముందు కారు దిగి "అమ్మోయ్! అమ్మా" అని అరుస్తూ లోపలికి పరిగెత్తిన నీల తల్లిని చూసి నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

అపర్ణ బాగా లావైంది. కళ్ళకింద నల్లటి చారలు, ముఖమంతా నల్లటి చుక్కలు. పిగ్మెంటేషన్. జుట్టు ఊడిపోయి పిలకలా తయారైంది.

"అమ్మా. ఏంటి ఇలా తయారయ్యావు?" అయోమయంగా అడిగింది.

"మోకాళ్ళ నొప్పులు కదా. మూమెంట్ లేక లావైపోయింది. పైగా నీ పెళ్ళి గురించి దిగులు. ఆ దిగులుతోనే మనిషి బాగా పాడైపోయింది" సుభాష్ చెప్పాడు.

నీల తల్లిని కౌగలించుకుని పెద్ద పెట్టున ఏడ్చింది. ఆ ఏడ్పులో ఓ విధమైన బాధతో పాటు ఊరట కూడా ఉంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments